# నేటి నుంచి అంజన్న జయంతోత్సవాలు

- తరలిరానున్న హన్ మాన్ దీక్ష పరులు
- కాషాయమయం కానున్న కొండగట్టు
- ప్రత్యేక దర్శన ఇవ్వనున్న నరసింహ వక్రా ఆంజనేయుడు..

**జగిత్యాల, మే19 :**

తెలంగాణాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామికి ఏటా రెండుసార్లు జయంతి ఉత్సవాలు నిర్వహి స్తుంటారు. ఏటా చైత్ర పౌర్ణమి రోజు హనుమాన్ చిన్న జయంతిని వైశాఖ బహుళ దశమి పూర్వా భద్ర నక్షత్రం రోజున పెద్ద జయంతి ఉత్సవాలు ని ర్వహిస్తారు. కొండగట్టులో చిన్న జయంతి నుంచి పెద్ద జయంతి మధ్య 41 రోజుల వ్యవధి ఉంటుంది. ఈ నెల 11 నుంచి మూడు రోజుల పాటు చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించగా.. మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు పెద్ద జయంతి ఉత్సవాలు నిర్వ హించనున్నారు. ఉత్సవాలకు లక్ష మందికి పైగా హనుమాన్ దీక్ష స్వాములు కొండగ ట్టును తరలిరా నున్నారు. అందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్ ఇప్పటికే జిల్లా అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. వేసవి ఎండలు మండిపోతున్న నేపథ్యంలో భక్తులు ఇబ్బంది పడకుండా చలవపందిళ్లు, మంచినీటి సౌకర్యం వంటి ఏర్పాటు చేస్తున్నారు.

**ఆలయ ప్రత్యేకత...**

జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి 15 కిలో మీటర్ల దూరంలోని జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారికి రెండు కిలో మీటర్ల దూరంలో ఎత్తైన కొండలపై వెలసి కొండగట్టు ఆంజనేయస్వామి కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా భక్తులు విశ్వసి స్తారు. దాదాపు అయిదు వందల ఏళ్ల కిందట కొ డిమ్యాల పరగణాకు చెందిన సింగం సంజీవుడు ఆవులను మేపుతూ కొండగట్టు ప్రాంతంలోని గుట్టల్లోకి వెళ్లగా ఓ ఆవు తప్పిపోయింది. దానిని వెతికే క్రమంలో ఓ బండరాయిపై నిద్రలోకి జారుకోగా స్వప్నంలో ఆంజనేయ స్వామి ప్రత్య క్షమై ముళ్లపొదల్లో పడి ఉన్న తనకు గుడి నిర్మిం చాలని, ఆవు చెట్ల పొదల్లో ఉందని చెప్పి మాయ మైనట్లు.... తర్వాత సంజీవుడు మేల్కొని ముళ్ల పొదల మధ్య ఉన్న స్వామివారి విగ్రహం వద్దకు వెళ్లగానే ఆవు ఎదురుగా వచ్చిందని, తర్వాతచిన్న గుడి నిర్మించినట్లు అర్చకులు, చరిత్రకారులు చెబుతుంటారు.



**నరసింహ వక్రాంతో ఆంజనేయుడు..**

కొండగట్టులో కొలువుదీరిన ఆంజనేయస్వామి ముకుళిత హస్తాలతో ఉత్తరం వైపు వెళ్తున్నట్లు కనిపి స్తారు. విగ్రహం తలపై స్వామివారి పంచముఖాలలో ఒకటైన నారసింహుని ముఖం (వక్త్రం)తో దర్శనమి వ్వడం మరో ప్రత్యేకత. ఆలయానికి దాదాపు అర కిలో మీటర్లదూరంలోని లోయలోనిమంచినీళ్ల బావి నుంచి జలాన్ని తీసుకొచ్చే నిత్యం ఉదయం, సాయంత్రం రెం దుసార్లు స్వామివారికి అభిషేకం చేయడం మరో ప్రత్యే కత. ఎడమవైపున జలబుగ్గ అనే ప్రాంతంలో మండు వేసవిలోనూ నీరు ప్రవహిస్తుంటుంది. స్వామివారి ప్రధాన ఆలయానికి కుడివైపున వేంకటేశ్వర స్వామి. ఎడమవైపున అమ్మవారి ఉపాలయాలు ఉన్నాయి. ఆలయానికి వెనుకవైపున క్షేత్ర పాలకు డైన భేతాళుడి గుడి ఉంది. దాని పక్కనే ఎత్తైన బండరాళ్లపై కొండా ల్రాయుడు అనే పరాక్రమవంతుడు శత్రువులకు చిక్క కుండా నివాసమున్నట్లు ఆనవాళ్లు కూడా ఉన్నాయి. మరికొంత దూరంలో కని పించే గుహల్లో మునులు తపస్సు చేసినట్లు చెబుతారు. ఆలయానికి వెళ్లే దారి పక్కన సీతమ్మ కన్నీటి గుంతలు కనిపిస్తాయి.

**గుడికి చేరే మార్గం..**

కరీంనగర్ నుంచిదాదాపు 40కిలోమీటర్ల దూరంలో దొంగలమర్రి నుంచి జేఎన్టీయూ కళాశాల మీదుగా ఆలయానికి చేరుకోవచ్చు. జగిత్యాల వైపు నుంచి వచ్చే భక్తులు 15 కిలో మీటర్ల దూరంలోని కొం డగట్టు స్టేజీ నుంచి ఘాట్ రోడ్డు మీదుగా 2 కిలో మీటర్లు ప్రయాణించి ఆలయానికి చేరుకోవచ్చు. మెట్లదారిన ఆలయం వరకు నడచి వెళ్లవచ్చు. కరీంన గర్. జగిత్యాల నుంచి నిత్యం ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.

**ముడుపుపై విశ్వాసం..**

భక్తులు చాలా మంది సొంత వాహనాల్లో జేఎన్టీయూ మీదుగా కొండపైకి చేరుకుంటారు. ఇంట్లో ఒంట్లో బాగులేనివారు కొండగట్టు అంజన్నకు ముడుపు కడితే చాలు అంతా మంచే జరుగుతుందని భక్తులు ప్రగాఢ నమ్మకం. నమ్మకంతో నిత్యం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుం ది. 'వైశాఖ బహుళ దశమి రోజున హనుమాన్ పెద్ద జయంతి' సందర్భంగా లక్షలాది మంది భక్తులు స్వామి వారి మాలను ధరించి దీక్షలు చేపడుతారు. ఈ సమయంలో కొండపైకి దీక్షపరులు చేరుకోవ డంతో కొండగట్టు మొత్తం కాషాయమాయంగా మారుతుంది. స్వామి సన్నిధిలో దీక్ష స్వాములు మాల విరమణ చేస్తారు.






# అమృత్ స్టేషన్‌కు వేళాయె

## తెలంగాణలో నేడు మూడు రైల్వే స్టేషన్ల పున: ప్రారంభం

**శెనార్తి మీడియా, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని మూడు ప్రధాన రైల్వే స్టేషన్లు సరికొత్త రూపు సంతరించుకున్నాయి. హైదరాబాద్‌లోని బేగంపేట, వరంగల్, కరీంనగర్ రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు పూర్తయ్యాయి. దేశ వ్యాప్తంగా మొత్తం 102 స్టేషన్లు పునః ప్రారంభం కానుండగా, అందులో తెలంగాణకు చెందిన మూడు స్టేషన్లకు స్థానం దక్కింది. ఈ స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా, దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈ స్టేషన్ల చిత్రాలను సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పంచుకున్నారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఏబీఎస్ఎస్) నిధుల ద్వారా చేపట్టిన పనులతో ఈ స్టేషన్లు విమానాశ్రయాల తరహాలో అత్యాధునిక హంగులతో ప్రకాశిస్తున్నాయి. స్టేషన్ల వెలుపలి, లోపలి భాగాలలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేశారు.

**రూ. 26.64 కోట్లతో కరీంనగర్..**

కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో దాదాపు రూ. 26.64 కోట్ల వ్యయంతో రెండేళ్ల కిందట ప్రారంభమైన ఆధునీకరణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఈ స్టేషన్‌ను పూర్తిగా మెరుగుపరిచారు. ప్రయాణికులు ఒక ప్లాట్‌ఫారమ్ నుంచి మరొక ప్లాట్‌ఫారమ్‌కు వెళ్లేందుకు మెట్లు ఎక్కే శ్రమను తగ్గించేందుకు ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేశారు. విశాలమైన వేచి ఉండే ప్రాంతాలు, పరిశుభ్రమైన ప్లాట్‌ఫారమ్‌లు, ఆధునిక మరుగుదొడ్లు, మెరుగైన లైటింగ్, టికెట్ కౌంటర్లు, లాకర్ గదులు, తాగునీటి సౌకర్యం, ఏటీఎంలు, డిజిటల్ డిస్‌ప్లేలు, సీసీ టీవీ కెమెరాలు వంటి అనేక సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ రైల్వే స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా 102 రైల్వే స్టేషన్లను ఒకేసారి ప్రారంభిస్తారని తెలిపారు. తెలంగాణలో ఎంపికైన మూడు స్టేషన్లలో కరీంనగర్ ఉండటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కరీంనగర్ స్టేషన్ అద్భుతంగా మారిందని.. త్వరలోనే జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా ఆధునీకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. తీగలగుట్ట ఆర్వోబీ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. బడ్జెట్ కంటే అదనంగా మరో రూ.2 కోట్లు వెచ్చించి రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామని, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే.. ఉప్పల్ ఆర్వోబీ పనుల్లో జాప్యంపై కాంట్రాక్టర్, అధికారులను మందలించామని ఆయన పేర్కొన్నారు.



**రూ.26.55 కోట్లతో బేగంపేట స్టేషన్ ఆధునీకరణ**

26.55 కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునికంగా బేగంపేట రైల్వే స్టేషన్ ను ఆధునీకరించారు. బేగంపేట రైల్వే స్టేషన్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పునరాభివృద్ధి చేశారు. 26.55 కోట్ల రూపాయల వ్యయంతో పునరాభివృద్ధి చేశారు. కొత్త స్టేషన్ భవనం, 12 మీటర్ల వెడల్పు గల ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్లాట్‌ఫామ్ షెల్టర్, లిఫ్ట్‌లు/ఎస్కలేటర్లు, కొత్త వెయిటింగ్ హాల్, కొత్త టాయిలెట్లు ఇలా ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని మౌలిక వసతులను కల్పించారు. గతంలో పోల్చితే ప్రస్తుత స్టేషన్ ను చూస్తే ఎంతో వ్యత్యాసం కనిపిస్తున్నది.

**ఎయిర్ పోర్ట్ తరహాలో వరంగల్**

సర్వాంగ సుందరంగా వరంగల్ రైల్వే స్టేషన్ అత్యాధునిక వసతులతో ఎయిర్ పోర్ట్ తరహాలో అభివృద్ధి చేశారు. రూ.25.41 కోట్ల నిధులతో అధునాతన వరంగల్ రైల్వే స్టేషన్ భవనం పునః ప్రారంభానికి సిద్ధమైంది. అత్యాధునిక వసతులతో వరంగల్ రైల్వే స్టేషన్ లో విశాలమైన ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్లు , లిఫ్టులు, ర్యాంపులు, ల్యాండ్ స్కేపింగ్, ఆధునిక ఆహారశాలలు, వాణిజ్య సముదాయాలు నిర్మించారు. వరంగల్ స్టేషన్ స్వాగత తోరణాన్ని కాకతీయుల కళాతోరణాన్ని పోలి ఉండేలా నిర్మించడం ప్రయాణికులను ఆకట్టుకుంటున్నది.

### అమృత్ భారత్ స్టేషన్ పథకం అంటే..

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, స్టేషన్లను ఆధునీకరించడం వంటి పనులు చేపట్టడం అమృత్ భారత్ స్టేషన్ పథకం ముఖ్య ఉద్దేశం ప్రయాణికులకు సౌకర్యవంతమైన వేచి ఉండే ప్రాంతాలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, ఉచిత వైఫై సదుపాయం కల్పించడం. దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేయడం. స్టేషన్లలో ప్రయాణికుల సమాచార వ్యవస్థను మెరుగుపరచడం, పర్యావరణ అనుకూలమైన పద్ధతులను అవలంబించడం, నీటి సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటివి వీటిలో భాగంగా ఉంటాయి. తెలంగాణలో అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన రైల్వే స్టేషన్లలో ముఖ్యంగా.. సికింద్రాబాద్, బేగంపేట్, కాచిగూడ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, రామగుండం, నల్గొండ, మిర్యాలగూడ, జనగాం, భువనగిరి, మధిర, యాదాద్రి వంటి స్టేషన్లు ఉన్నాయి. అయితే వీటిలో వరంగల్, కరీంనగర్, బేగంపేట్ రైల్వే స్టేషన్ల పనులు పూర్తయ్యాయి. మరో 37 స్టేషన్ల పనులు కొనసాగుతున్నాయి. అమృత్ భారత్ పథకం కింద దేశవ్యాప్తంగా 1309 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడానికి ఎంపిక చేశారు.



## ఆపరేషన్ సింధూర్ తో
# మన సత్తా ప్రపంచానికి తెలిసింది

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

యుద్ధానికి కేవలం విరామమే ఉందే తప్ప, అది ముగిసినట్లు భావించరాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. దేశానికి ఎప్పుడైనా ముప్పు ఎదురైతే టెర్రరిస్టుల అంతు చూస్తామని స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత సైన్యం తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందన్నారు. పాకిస్తాన్ ప్రజల ప్రాణాలకు నష్టం కలగకుండా, అక్కడి ఉగ్ర శిబిరాలపై భారత్ నిర్వహించిన దాడులు సాహసోపేతంగా జరిగాయని చెప్పారు. నరేంద్ర మోదీ నాయకత్వానికి, భారత సైన్యానికి సంఘీభావంగా 'తిరంగా ర్యాలీ'లు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు.కరీంనగర్ గీతాభవన్ చౌరస్తా నుండి రాంనగర్ చౌరస్తా వరకు జరిగిన 'తిరంగా ర్యాలీ'లో బీజేపీ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. జాతీయ జెండాలు చేతబట్టి మోదీ, భారత సైన్యానికి మద్దతుగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, "పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం పాకిస్తాన్ లోని ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసింది. మోదీ నాయకత్వంలో సైన్యం ఎప్పటికప్పుడు తగిన ప్రతీకారం తీసుకుంటోంది. 2019 లో పుల్వామా దాడి తర్వాత జైషే మహమ్మద్ స్థావరాలపై సర్జికల్ దాడులు, తాజాగా ఏప్రిల్ 22న పెహల్గామ్ దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ కొనసాగించాం. 23 నిమిషాల్లో పాక్ భూభాగంలో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి, దాదాపు 100 మందిని మట్టుబెట్టాం," అని పేర్కొన్నారు."మతం పేరుతో ప్రజలను చంపడం దుర్మార్గం. ఉగ్ర దాడులు మానవత్వాన్ని అపహాస్యం చేస్తున్నాయి. ముంబయి, కోయంబత్తూరు, హైదరా బాద్ లాంటి నగరాల్లో జరిగిన పేలుళ్లు ఇప్పటికీ జ్ఞాపకమే," అని అన్నారు.''ఆపరేషన్ సింధూర్'' సమయంలో కంట్రోల్ రూం బాధ్యతలు నిర్వహించేటప్పుడు సైనికుల సాహసాలను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించిందని తెలిపారు. మోదీ మంత్రివర్గంలో ఉండడం తన అదృష్టమని అన్నారు."మన సైనికులు ఎంత ధైర్యంగా, నిబద్ధతతో ముందుకు సాగుతున్నారో చూస్తే గర్వంగా ఉంది. వీరి సేవలు గుర్తుపడేందుకు, మద్దతు తెలిపేందుకు ఈ తిరంగా ర్యాలీ నిర్వహించాం. పాల్గొన్న ప్రతి ఒక్కరికి శతకోటి వందనాలు," అని బండి సంజయ్ చెప్పారు.

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**





# ఉల్లంపల్లిలో హనుమాన్ శోభాయాత్ర


- రూ. 20వేల విలువచేసే స్వామి వారి పల్లకీ అందజేసిన శ్రీకాంత్,శ్రీను..
- జైశ్రీరామ్ జై హనుమాన్ అంటూ నినాదాలు..
- ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు..

**శెనార్తి మీడియా, చిగురుమామిడి:**

చిగురుమామిడి మండ లం ఉల్లంపల్లి గ్రామంలో హనుమాన్ శోభా యాత్రను శ్రీ ఆంజనేయ స్వామి భక్తులు సోమవారం రాత్రి కన్నుల పండవగా నిర్వహించారు. వందల్లో భక్తులు తరలివచ్చి పల్లెకి సేవలో ఉన్న ఆంజనేయ స్వామి చిత్రపటం వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీ ఆంజనేయ స్వామి భక్తులు జైశ్రీరామ్ జై హనుమాన్, జై ఆంజనేయం అంటూ పల్లకి సేవలో గ్రామాల్లోని పురవీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. ఉల్లంపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి శ్రీకాంత్ మానస కుటుంబ సభ్యులు,కొలిపాక శ్రీను మంగవ్వ కుటుంబ సభ్యులు దాదాపు 20వేల రూపాయలు విలువ చేసే స్వామివారి పల్లకి సేవను శ్రీ ఆంజనేయ స్వామి భక్త బృందానికి అందజేశారు.ఈ శోభాయాత్రలో ఆంజనేయస్వామి వేషధారణలో దీక్షపరులు తమ భక్తులు చాటారు.ఈ కార్యక్రమంలో కొండ పురుషోత్తం, బుర్ర సంపత్ గౌడ్,కొత్తపల్లి శ్రీకాంత్,కొలిపాక పవన్,జనవేణి అనిల్,కొండ మల్లికార్జున్,కొలిపాక శ్రీనివాస్,దినేష్,శంకర్,నరసయ్య, రాజు,బండారి సాగర్,నవీన్, శ్రీనివాస్,మణిదీప్,సిద్దు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భార్య గొంతు కోసి హత్య చేసిన భర్త

ఆర్మూర్, మే 19: అనుమానమే పెనుభూతమై హత్య దారితీసింది. భార్య గొంతు కోసి హత్య చేసిన భర్త. సోమవారం రోజు ఆర్మూర్ పట్టణ కేంద్రంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పెద్ద బజార్ లో తమ్మలి ప్రవీణ్, అనే వ్యక్తి ఇంట్లో కిరాయికి ఉంటున్న మృతురాలు ముద్దంగుల అంజలి, తన భర్త గంగారెడ్డితో గొడవ పడి వేరుగా ఉంటున్న తనపై అనుమానంతో కత్తితో గొంతు కోసి ఆమె భర్త హత్య చేశాడు. స్థానికుల కథనం ప్రకారం అక్రమ సంబంధాన్ని నిలదీసినందుకే ఈ హత్య జరిగిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య సమాచారం అందుకున్న జిల్లా సీపీ ఐపిఎస్, సాయి చైతన్య, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, సీఐ సత్యనారాయణ గౌడ్, సంఘటన స్థలానికి చేరుకొని నిందితుడు గంగారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసినట్టు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్య నారాయణ గౌడ్, పోలీస్ సిబ్బందితో కలిసి పరిశీలించి వివరాలను సేకరించి కేసు నమోదు చేశారు. పోలీసులు నిందుతుడిని అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# లఖ్‌నవూ ప్లే ఆఫ్స్ ఆశలు గల్లంతు

**- ఎట్టకేలకు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు విజయం**

ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే గెలవాల్సిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ పరాజయం పాలైంది. ప్లే ఆఫ్స్ రేసు నుంచి దాదాపు నిష్క్రమించింది. వరుస పరాజయాలతో సతమతమవుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎట్టకేలకు ఓ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే గెలవాల్సిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ పరాజయం పాలైంది. ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. వరుస పరాజయాలతో సతమతమవుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎట్టకేలకు ఓ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. భారీ స్కోరును కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. లఖ్‌నవూ ప్లే ఆఫ్స్ ఆశలపై నీళ్లు చల్లింది. లఖ్‌నవూలోని ఏకనా స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ మొదట బౌలింగ్ ఎంచుకుంది. దీంతో లఖ్‌నవూ టీమ్ బ్యాటింగ్‌కు దిగింది. సన్‌రైజర్స్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న లఖ్‌నవూ ఓపెనర్లు మిచెల్ మార్ష్ (65), మార్‌క్రమ్ (61) బౌండరీల వర్షం కురిపించారు. ఇద్దరూ తొలి వికెట్‌కు 115 పరుగులు జోడించారు. మార్ష్ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ (7) మరోసారి విఫలమయ్యాడు. ఆ తర్వాత వచ్చిన నికోలస్ పూరన్ (45) మరోసారి కీలక పరుగులు చేశాడు. దీంతో లఖ్‌నవూ టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. సన్‌రైజర్స్ బౌలర్లలో ఎషాన్ మలింగ రెండు వికెట్లు దక్కించుకున్నాడు. హర్ష్ దూబే, హర్షల్ పటేల్, నితీష్ ఒక్కో వికెట్ తీశారు.

# శ్రేయస్ అయ్యర్ అరుదైన ఘనత



పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అరుదైన ఘనతను సాధించాడు. 3 ఫ్రాంచైజీలను ఐపీఎల్ ప్లేఆఫ్‌కు తీసుకెళ్లిన మొదటి కెప్టెన్‌గా శ్రేయస్ నిలిచాడు. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ విజయం సాధించి ప్లే ఆఫ్స్‌కు చేరుకుంది. దాదాపు దశాబ్దకాలం తర్వాత పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్‌లో ఆడనుంది. పంజాబ్ చివరిసారిగా 2014లో ప్లేఆఫ్‌కు చేరి ఫైనల్‌లో తలపడింది. అయితే, టైటిల్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ చేతిలో ఓడిపోయింది.పంజాబ్ కింగ్స్‌కు మొదటిసారి నాయకత్వం వహిస్తున్న శ్రేయస్ అయ్యర్ జట్టును ప్లేఆఫ్స్‌కు తీసుకెళ్లాడు. గతేడాది కేకేఆర్ తరఫున టైటిల్ గెలుచుకున్నాడు. 2020 సీజన్‌లో ముంబయి ఇండియన్స్‌తో జరిగిన ఫైనల్‌తో సహా రెండు సందర్భాల్లో దిల్లీ క్యాపిటల్స్‌ను ప్లేఆఫ్‌కు తీసుకెళ్లాడు. ఈ ఏడాది మెగా వేలానికి ముందే శ్రేయస్ కేకేఆర్‌ను విడిచిపెట్టాడు. గత సీజన్?లో కోల్?కతాకు టైటిల్‌కు వచ్చినప్పటికీ, తనకు తగిన క్రెడిట్ లభించలేదని శ్రేయస్ అన్నాడు. ఈ కారణం వల్ల ఐపీఎల్? 2025 మెగా వేలంలోకి ప్రవేశించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. వేలానికి ముందు పంజాబ్ కింగ్స్?కు ఆస్ట్రేలియా బ్యాటర్ రికీ పాంటింగ్‌ను ప్రధాన కోచ్‌గా నియమించింది. ఇదివరకే దిల్లీ కేపిటల్స్ తరఫున వీరి మధ్య భాగస్వామ్య ఉండడం వల్ల అయ్యర్‌ను కెప్టెన్‌గా తీసుకోవడానికి రికీ పాంటింగ్ ఆసక్తి చూపించాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో పంజాబ్ కింగ్స్ రూ. 26.75 కోట్లకు శ్రేయస్‌ను కొనుగోలు చేసింది. దీంతో చరిత్రలో రెండో అత్యంత ఖరీదైన ఆటగాడిగా శ్రేయస్ నిలిచాడు. ఈ సీజన్‌లోని ఇతర ఖరీదైన ఆటగాళ్ల కాకుండా, అయ్యర్ కెప్టెన్‌గా, బ్యాటర్?గా అంచనాలకు మించి రాణిస్తున్నాడు. ఇప్పటివరకూ ఆడిన 12 మ్యాచ్‌ల్లో శ్రేయస్ 48.33 సగటుతో 435 పరుగులు చేశాడు. ఈ సీజన్?లో 174.70 స్ట్రైక్ రేట్‌తో 4 హాఫ్ సెంచరీలు చేసి నిలకడగా రాణిస్తున్నాడు. లఖనవూ సూపర్ జెయింట్స్ బ్యాట్స్‌మన్ నికోలస్ పూరన్ (34) తర్వాత ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన రెండవ ఆటగాడిగా శ్రేయస్ (27) నిలిచాడు.ఈ సీజన్?లో పంజాబ్ తొలి ఐపీఎల్? టైటిల్‌ను లక్ష్యంగా పరుగులు పెడుతోంది. ఇప్పటివరకూ ఆడిన 12 మ్యాచ్‌ల్లో 8 విజయాలతో 17 పాయింట్లు సాధించింది. ఇంకా 2 మ్యాచ్‌లు మిగిలి ఉండగానే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడం గమనార్హం. ఫైనల్‌కు చేరుకునే అవకాశాన్ని మెరుగుపరచడానికి పాయింట్ల పట్టికలో మొదటి రెండు స్థానాల్లో నిలవాలని పంజాబ్ లక్ష్యంగా చేసుకుంది. శ్రేయస్ అయ్యర్ పంజాబ్ కింగ్స్‌కు తమ తొలి టైటిల్‌ను అందించగలరా లేదా అని క్రికెట్ అభిమానులు వేచి చూస్తున్నారు.

## మా జట్టు ఓటమికి

# బౌలర్లు కారణం


**- రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్**



ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ ఆడిన 13 మ్యాచ్‌ల్లో 10 ఓటములను చవిచూసింది. ఆదివారం పంజాబ్ కింగ్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టు పదో ఓటమిని చవిచూసింది. అది కూడా కేవలం 10 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ ఏడాది ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ అనేక మ్యాచ్‌లలో గెలుపుకు దగ్గరగా వచ్చారు కానీ పరాజయాలను ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితిలో రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ తన జట్టును తీవ్రంగా విమర్శిస్తున్నాడు. ఈ పరాజయాలకు బౌలింగ్‌ను నిందించాడు. ఈ పరిస్థితి బ్యాటర్ల వల్ల కాదని.. బౌలర్ల వల్లే వచ్చిందని ద్రవిడ్ సంచలన ప్రకటన చేశాడు. పంజాబ్ కింగ్స్ జట్టుపై ఓటమి తర్వాత రాహుల్ ద్రవిడ్ జట్టు పరిస్థితిని వివరించాడు. కేవలం బ్యాటర్లను మాత్రమే నిందించడంలో అర్థం లేదని.. బౌలర్లు కూడా దానికి ప్రధాన కారణమని పేర్కొన్నాడు. నిజం చెప్పాలంటే తాము 20 పరుగులు ఎక్కువగా ఇచ్చినట్లు వెల్లడించాడు. లక్ష్యం 195 లేదా 200 పరుగులు ఉంటే అలవోకగా చేసి ఉండేవాళ్లమన్నాడు. రాజస్థాన్ విజయానికి చాలా దగ్గరగా వచ్చిందని.. కానీ ఛేదనను విజయవంతంగా పూర్తి చేయలేకపోయామన్నాడు. ఈ సిరీస్ అంతటా తాము 15 లేదా 20 అదనపు పరుగులు వదులుకున్నామని తాను అనుకుంటున్నట్లు చెప్పుకొచ్చాడు. తాము చాలా మ్యాచ్‌లలో గెలవడానికి దగ్గరగా వచ్చి ఓడిపోయమన్నాడు. మిడిల్ ఆర్డర్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు భారీ షాట్లను కొట్టలేకపోయారని పేర్కొన్నాడు. 5 మ్యాచ్‌లను చాలా తక్కువ తేడాతో ఓడిపోయామన్నారు. తాము పంజాబ్ తో జరిగిన మ్యాచ్‌లో చాలా వికెట్లు కోల్పోయామని చెప్పలేమని.. ఈ రోజు మ్యాచ్‌లో తాము కేవలం 5 వికెట్లు మాత్రమే కోల్పోయామన్నారు. కానీ మేము ఆ షాట్లు కొట్టలేకపోయామని రాహుల్ ద్రవిడ్ అన్నాడు.

## మహమ్మద్ షమీ

# పూర్తి స్థాయిలో విఫలం



ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తన తదుపరి మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్లే ఆఫ్స రేసు నుంచి తప్పుకున్న ఈ జట్టు, ఇప్పుడు పరువు కోసం మాత్రమే పోరాడాల్సిన పరిస్థితికి చేరుకుంది. 11 మ్యాచ్‌ల్లో కేవలం 3 విజయాలతో పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో నిలిచిన ఆరెంజ్ ఆర్మీ, తదుపరి మూడు మ్యాచ్‌ల్లో గెలిచినట్లయితే పాయింట్ల పట్టికలో మరింత మెరుగైన స్థానం పొందే అవకాశం ఉంది. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ ఇప్పటికే ఐదు విజయాలతో ప్లే ఆఫ్స రేసులో నిలిచి ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం లక్నో వేదికగా జరగనున్న మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ బౌలింగ్ విభాగం తీవ్రంగా తడిసి మోపెడు అయింది. ముఖ్యంగా రూ.10 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన అనుభవజ్ఞుడైన మహమ్మద్ షమీ పూర్తి స్థాయిలో విఫలమయ్యాడు. 9 మ్యాచ్‌ల్లో కేవలం 6 వికెట్లు మాత్రమే తీసి, 11.23 ఎకానమీ రేటుతో నిరాశ పరచిన షమీ, ఢిల్లీతో జరిగిన గత మ్యాచ్‌కు కూడా ఎంపిక కాకుండా బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఈ మ్యాచ్‌లోనూ అతనికి చోటు లేకపోవచ్చని భావిస్తున్నారు. అతని స్థానంలో జయదేవ్ ఉనాద్కత్‌ను కొనసాగించే అవకాశముంది. దీనితోపాటు ఎక్స్‌ట్రా బ్యాటర్‌గా అభినవ్ మనోహర్, స్మరణ్ రవిచంద్రన్ లేదా సచిన్ బేబీల్లో ఒకరిని ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దించవచ్చు. షమీ లాంటి అనుభవజ్ఞుడి వైఫల్యం జట్టుపై తీవ్ర ప్రభావం చూపడమే కాక, ఇతర బౌలర్ల ప్రదర్శన కూడా పెద్దగా ఆకట్టుకోకపోవడం ఆరెంజ్ ఆర్మీని నిరుత్సాహానికి గురిచేసింది.ఇదిలా ఉంటే, ఇటీవల %బ్రూా% బ్రేక్ కారణంగా స్వదేశానికి వెళ్లిన కెప్టెన్ ప్యాట్ కమిన్స్, స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ తిరిగి జట్టులో చేరారు. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ తుది జట్టులో ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, హెన్రీచ్ క్లాసెన్, అనికేత్ వర్మ వంటి బ్యాటర్లు ప్రధాన భుజాలుగా నిలవనున్నారు. ఆల్‌రౌండర్ కామిందు మెండిస్ స్పిన్ విభాగంలో కీలక భూమిక పోషించనున్నాడు. పేస్ విభాగాన్ని ప్యాట్ కమిన్స్, హర్షల్ పటేల్, జయదేవ్ ఉనాద్కట్ లు పంచుకోనున్నారు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా జీషన్ అన్సారీ తుది జట్టులో చోటు దక్కించుకోనున్నాడు. అయితే, అతని ప్రదర్శన కూడా ఇప్పటివరకు నిరాశ పరిచిందనే విమర్శలు ఉన్నాయి.



# ఆసియా కప్ నుంచి భారత్ ఔట్?

పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న క్రమంలో బోర్డ్? ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా- బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో బీసీసీఐ క్లారిటీ ఇచ్చింది ఆ వార్తలను ఖండించింది.కాగా, అంతకుముందు ఈ ఏడాది జరిగే ఆసియా కప్ టోర్నీ నుంచి వైదొలగాలని నిర్ణయించినట్లు వార్తలు వచ్చాయి. బీసీసీఐ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా సంస్థలు కథనాలు వెల్లడించాయి. దీనిపై ఇప్పటికే ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ)కి భారత బోర్డు సమాచారం ఇచ్చినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. తద్వారా ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే పురుషుల ఆసియా కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత జట్టు ఆడే అవకాశాలు లేనట్లు చెప్పాయి. ఇక, జూన్‌లో జరిగే మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ నుంచి కూడా వైదొలగాలని బీసీసీఐ నిర్ణయించినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా క్లారిటీ ఇచ్చారు.“ఈరోజు ఉదయం నుంచి, ఆసియా కప్ మరియు ఉమెన్స్ ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌లో పాల్గొన కూడదని నిర్ణయించినట్లు కొన్ని వార్తల నివేదికలు మా దృష్టికి వచ్చాయి. అలాంటి వార్తల్లో ఎలాంటి నిజం లేదు. తదుపరి ఈవెంట్‌ల గురించి చర్చించలేదు లేదా అలాంటి చర్యలు తీసుకోలేదు. ఏం లేఖ రాయడం గురించి కూడా చెప్పలేదు. ఈ దశలో, మా ప్రధాన దృష్టి ఐపీఎల్, పురుషులు- మహిళల తదుపరి ఇంగ్లాండ్ సిరీస్‌లపై ఉంది.” అని క్లారిటీ ఇచ్చారు. అంతకుముందు, జమ్ముకశ్మీర్?లోని పహల్గాం ఉగ్ర దాడిలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్‌ను ఏకాకిని చేయాలనే ఉద్దేశంతోనే బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంటర్నేషనల్ క్రికెట్ ఈవెంట్లకు ఉన్న స్పాన్సర్లలో ఎక్కువ మంది భారత్‌కు చెందిన వారే. కాగా, భారత్-పాకిస్థాన్ మధ్య మ్యాచ్ లేకుండా ఆసియా కప్ ఉంటే, దాన్ని ప్రసారం చేసేందుకు బ్రాడ్‌కాస్టర్లు కూడా అంత ఆసక్తి చూపించే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో టీమ్‌ఇండియా లేకుండా ఆసియా కప్ టోర్నీని నిర్వహించడం అనేది సరైన నిర్ణయం కాదని ఏసీసీ భావించే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాల అభిప్రాయపడ్డట్లు వార్తలు వచ్చాయి.2023 ఆసియా కప్ ఎడిషన్‌పైనా భారత్-పాకిస్థాన్ సంబంధాలు ప్రభావం చూపిచాయి. ఆ ఎడిషన్‌లో టోర్నీకి పాకిస్థాన్ ఆతిథ్యమిచ్చింది. ఆ దేశానికి వెళ్లేందుకు బీసీసీఐ ఒప్పుకోలేదు. దీంతో శ్రీలంక వేదికగా భారత్ మ్యాచ్‌లను ఏర్పాటు చేశారు. మామూలుగానే ఇండియా-పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగట్లేదు. కేవలం ఐసీసీ టోర్నీల్లోనే ఆడుతున్నాయి. ఇప్పుడు ఆసియా కప్ నుంచి వైదొలగాలని బీసీసీఐ నిర్ణయించిన నేపథ్యంలో టోర్నీని వాయిదా వేసే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

## గంభీర్ వల్లే

# శ్రేయస్‌కు అన్యాయం

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కారణంగానే స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌కు అన్యాయం జరిగిందంటూ భారత దిగ్గజ మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఐపీఎల్ ట్రోఫీ సాధించడంతో కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ కీలక పాత్ర పోషించినప్పటికీ అతనికి దక్కాల్సిన గుర్తింపు దక్కలేదుని సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. కానీ, కేకేఆర్ ఛాంపియన్‌గా నిలిచినందుకు గంభీర్‌కే క్రెడిట్ అంతా ఇచ్చారని, అయ్యర్‌ను పట్టించుకోలేదని అన్నారు.గత ఏడాది కేకేఆర్‌కు మూడవ ఐపీఎల్ ట్రోఫీని అందించడంలో అయ్యర్ కీలక పాత్ర పోషించాడు, డొమెస్టిక్ క్రికెటర్‌లో ముంబై తరఫున మంచి ప్రదర్శన కనబర్చాడు, ఇప్పుడు ఐపీఎల్ 2025లో 2014 తర్వాత మొదటిసారి పంజాబ్ కింగ్స్‌ను ప్లేఆఫ్స్‌కు తీసుకెళ్లాడు. అయితే గత సీజన్‌లో ఐపీఎల్ విజయానికి అతనికి క్రెడిట్ దక్కలేదు. అన్ని ప్రశంసలు వేరొకరికి దక్కాయి. జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించేది కెప్టెన్, డగౌట్‌లో కూర్చున్న వ్యక్తి కాదు అని గవాస్కర్ బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్‌తో అన్నారు. “చూడండి, ఈ సంవత్సరం అతనికి మంచి క్రెడిట్ లభిస్తోంది. ఎవరూ రికీ పాంటింగ్‌కు పూర్తి క్రెడిట్ ఇవ్వడం లేదు ” అని గవాస్కర్ అన్నారు.

## కోహ్లీ రికార్డును

# బ్రేక్ చేసిన గిల్

ఐపీఎల్ 2025లో అద్భుతంగా పరుగులు సాధిస్తూ విరాట్ కోహ్లీ పేరిట ఉన్న రికార్డును బ్రేక్ చేశాడు. టీ20 క్రికెట్‌లో 5000 పరుగులు సాధించి రికార్డు సృష్టించాడు. 5 వేల టీ20 పరుగులు చేసిన అత్యంత వేగవంతమైన భారత ఆటగాళ్ల జాబితాలో శుభ్‌మన్ గిల్ రెండో స్థానంలో ఉన్నాడు.ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. గుజరాత్ టైటాన్స్ ముందు 200 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆ లక్ష్యాన్ని ఛేదించిన గుజరాత్ టైటాన్స్ వికెట్ కోల్పోకుండానే దానిని చేరుకుంది.గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్ ప్రారంభించిన సాయి సుదర్శన్ శుభ్‌మన్ గిల్ వికెట్ కోల్పోకుండా లక్ష్యాన్ని చేరుకున్నారు. గుజరాత్ టైటాన్స్ కేవలం 19 ఓవర్లలోనే విజయ లక్ష్యాన్ని చేరుకుంది. సాయి సుదర్శన్ 61 బంతుల్లో 108 పరుగులు చేశాడు. శుభ్‌మన్ గిల్ 53 బంతుల్లో 93 పరుగులు చేశాడు.



## విరాట్ కోహ్లీనే

# బెస్ట్ కెప్టెన్

**- మాజీ హెడ్ కోచ్ రవి శాస్త్రి**

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై మాజీ హెడ్ కోచ్ రవి శాస్త్రి ప్రశంసల జల్లు కురిపించాడు. కోహ్లీనే అత్యుత్తమ రెడ్ బాల్ కెప్టెన్ అని కొనియాడాడు. ఇటీవల విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. కోహ్లీ రిటైర్మెంట్ తనను ఆశ్చర్యానికి గురి చేసిందని చెప్పిన రవి శాస్త్రి.. ఫిట్‌గా ఉన్నా మానసిక అలసటతోనే రిటైర్మెంట్ ప్రకటించాడని తెలిపాడు. రిటైర్మెంట్ ప్రకటించే వారం రోజుల ముందు తనతో మాట్లాడాడని కూడా రవిశాస్త్రి గుర్తు చేసుకున్నాడు.తాజాగా ఓ టీవీ చర్చలో విరాట్ కోహ్లీనే అత్యుత్తమ టెస్ట్ కెప్టెన్ అని చెప్పుకొచ్చాడు.'విరాట్ కోహ్లీ అత్యుత్తమ రెడ్-బాల్ కెప్టెన్. కోహ్లీ కెప్టెన్సీలో భారత్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. విదేశాల్లోనూ విజయాలు సాధించింది. కోహ్లీ ఆట పట్ల అంకితభావం, దూకుడు, ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టడం వంటి లక్షణాలను నన్ను ఆకట్టుకున్నాయి. కోహ్లీ జట్టులోని ఆటగాళ్లను వెన్నుదట్టి ప్రోత్సహించేవాడు. కష్ట సమయాల్లో ఆటగాళ్లకు అండగా నిలిచేవాడు. మహ్మద్ షమీ విషయంలో కోహ్లీ చూపిన మద్దతును మరిచిపోలేను. జట్టులో ఫిట్‌నెస్ సంస్కృతిని తీసుకొచ్చిందే కోహ్లీ.'అని రవిశాస్త్రి చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లీ కారణంగానే టెస్ట్ క్రికెట్‌కు ఆదరణ పెరిగిందని కూడా రవిశాస్త్రి చెప్పాడు. కోహ్లీ దూకుడు.. నిలకడైన ఆటతోనే ప్రేక్షకులు మళ్లీ సంప్రదాయ క్రికెట్‌ను చూడటం మొదలు పెట్టారని, కోహ్లీ సారథ్యంలోని భారత జట్టును చూసేందుకు జనాలు ఎదురు చూసేవారని తెలిపాడు. టెస్ట్ క్రికెట్‌కు కోహ్లీ కంటే గొప్ప ప్రచారకర్త లేడని అభిప్రాయపడ్డాడు.విరాట్ కోహ్లీ తన 14 ఏళ్ల టెస్ట్ కెరీర్‌లో 123 టెస్ట్‌లు ఆడి 46.85 సగటుతో 9,230 పరుగులు చేశాడు. ఇందులో 30 సెంచరీలు ఉన్నాయి. సుదీర్ఘ ఫార్మాట్‌లో కోహ్లీ సక్సెస్‌ఫుల్ టీమిండియా కెప్టెన్. అతని సారథ్యంలో 68 మ్యాచ్‌లు ఆడిన టీమిండియా 40 మ్యాచ్‌లు గెలిచింది. అతని సారథ్యంలోనే టీమిండియా ఆసీస్ గడ్డపై టెస్ట్ సిరీస్ గెలిచింది. ఒకసారి డబ్ల్యూటీసీ ఫైనల్ చేరింది.



### ఆసక్తి రేపుతోన్న

# రాజ్ భార్య పోస్ట్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గురించి రోజుకో న్యూస్ వైరల్ అవుతూనే ఉంది. మూవీస్ విషయం పక్కన పెడితే ఎక్కువగా తన వ్యక్తిగత విషయాలు ఏదో ఓ రూమర్ వినిపిస్తూనే ఉన్నాయి. ఇక సామ్ రెండో పెళ్లికి సిద్ధమైనట్లు, దర్శకుడు రాజ్ నిడిమోరుతో ఆమె ప్రేమలో పడిందని, గత కొంతకాలంగా ఇద్దరూ డేటింగ్ చేస్తున్నారంటూ బాలీవుడ్, టాలీవుడ్ మీడియాలో వరుస వార్తలు ప్రచారం అవుతున్నాయి. సమంత ఎక్కడ ఉంటే అక్కడ రాజ్ ఉ ంటున్నాడు.దీంతో నెట్టింట ఎక్కడ చూసినా వీరిద్దరి గురించే విపరీతంగా చర్చ నడుస్తోంది. ఈ రూమర్స్‌పై సమంతగానీ, రాజ్ గానీ ప్రత్యక్షంగా స్పందించలేదు.కానీ రాజ్ నిడిమోరు భార్య శ్యామలి దే పెడుతున్న పోస్ట్‌లు చర్చకు దారితీస్తున్నాయి. తాజాగా ఆమె పెట్టిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. 'మంచి కర్మను సృష్టించండి. ప్రజలకు సాయం చేయండి. అందరితో న్యాయంగా వ్యవహరించండి' అంటూ ఇన్‌స్టా స్టోరీస్‌లో పోస్టు పెట్టింది. అంతకు ముందు 'నా గురించి మాట్లాడేవారికి.. నా తరఫున మాట్లాడేవారికి.. నేను చెప్పేది వినేవారికి.. నా గురించి వార్తలు వినేవారికి.. నా గురించి రాసే వారికి.. నా కోసం ఆలోచించేవారందరికీ దేవుడు ఆశీర్వాదం, ప్రేమ ఉండాలని కోరుకుంటున్నా' అనే పోస్ట్‌ను ఆమె షేర్ చేసింది. మొన్నటి వరకు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా లేని శ్యామలి, సామ్-రాజ్ డేటింగ్ రూమర్స్ మొదలైనకానుండే సడన్ గా పోస్టులు పెడుతుంది. దీంతో ఆమె వీరిద్దరిని ఉదేశించే పెడుతున్నట్లు-గా కామెంట్స్ వినిపిస్తున్నాయి.

### మహాభారతంలో

# కృష్ణుడి పాత్ర చేయాలని ఉంది

- జూనియర్ ఎన్టీఆర్ మనోగతం



జూనియర్ ఎన్టీఆర్ పెద్ద ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నాడు. దేవర మూవీతో మంచి హిట్ అందుకున్న ఆయన.. ఇప్పుడు ప్రశాంత్ నీల్ డైరెక్షన్ లో భారీ సినిమా చేస్తున్నాడు. డ్రాగన్ అనే పేరు పరిశీలనలో ఉంది. ప్రస్తుతానికి షూటింగ్ జరుగుతోంది. తర్వత దేవర-2, ఆ తర్వాత నెల్సన్ తో మూవీ ఉండొచ్చు. ఎన్టీఆర్ అంటే నటనకు మారుపేరు. ఎలాంటి పాత్రలో అయినా ఒదిగిపోవడం ఆయనకు చాలా సులువు. ఎన్టీఆర్ నటనను ఎంతో మంది డైరెక్టర్లు మెచ్చుకున్నారు. ఇప్పటికే ఎన్నో వైవిధ్య భరితమైన పాత్రల్లో నటించి మెప్పించాడు ఎన్టీఆర్. అలాంటి నటన కనబరిచే ఎన్టీఆర్ డ్రీమ్ రోల్ ఏంటో చాలా మందికి తెలియదు. ఎన్టీఆర్ కు ఉన్న ఒకే ఒక్క డ్రీమ్ రోల్ మహాభారతంలో కృష్ణుడి పాత్ర చేయడం. ఆ విషయంలో గతంలో కూడా బయటపెట్టాడు ఎన్టీఆర్. దర్శక ధీరుడు రాజమౌళి మహాభారతం సినిమాను తీస్తానని గతంలోనే ప్రకటించాడు. కాకపోతే దానికి చాలా సమయం పడుతుందన్నాడు. ఒకవేళ జక్కన్న ఈ మూవీ తీస్తే అందులో ఎన్టీఆర్ డ్రీమ్ రోల్ లో నటిస్తాడేమో చూడాలి. ప్రస్తుతానికి ప్రశాంత్ నీల్ సినిమాతో ఫుల్ బిజీగా గడిపేస్తున్నాడు జూనియర్. మొన్ననే ట్రిబుల్ ఆర్ కాన్సర్ట్ లో పాల్గొని వచ్చాడు. ఇప్పుడు కర్ణాటకలో డ్రాగన్ షూటింగ్ లో పాల్గొంటు-న్నాడు.

# కృష్ణ కుటుంబం నుంచి మరో నటుడు

**- తెరంగేట్రానికి సిద్దంగా రమేశ్ బాబు తనయుడు జయకృష్ణ**

సూపర్ స్టార్ కృష్ణ కుటుంబం నుంచి మరో నటుడు అరంగేట్రం చేయబోతున్నాడు. పెద్ద కుమారుడు, రమేష్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా పరిచయం కానున్నారని, గత కొంతకాలంగా వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. తాజాగా సోషల్ మీడియా లో జయకృష్ణకు సంబంధించిన ఓ ఫొటో షూట్ బయటకు రావడంతో ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. బ్లాక్‌సూట్‌లో మెస్మరైజింగ్‌లో లుక్‌లో కనిపించిన ఫొటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. కాగా జయకృష్ణ లండన్‌లో నటనలో ప్రొఫెషనల్ -ట్రైనింగ్ తీసుకున్నాడు. అయితే తాజాగా జయకృష్ణను తెలుగు చిత్రసీమలో ఆవిష్కరించేందుకు దర్శకుడు సిద్ధం అయ్యాడు. ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' లాంటి చిత్రాలతో బోల్డ్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న అజయ్ భూపతి దర్శకత్వం జయకృష్ణ ఎంట్రీ ఇవ్వనున్నట్లు-సమాచారం. వైజయంతీ మూవీస్, ఆనంది ఆర్ట్స్ ఈ ప్రాజెక్ట్‌ను సంయుక్తంగా నిర్మించనున్నాయి. అంటే ఈ భారీ ప్రాజెక్ట్‌ను ఇద్దరు ప్రముఖ నిర్మాతలు సంయుక్తంగా నిర్మించనున్నారని తెలుస్తోంది. అయితే అజయ్ భూపతి మాత్రం ప్రస్తుతం 'మంగళవారం 2'తో బిజీగా ఉన్నప్పటికీ, జయకృష్ణ డెబ్యూ సినిమాను కూడా త్వరలో సెట్స్‌పైకి తీసుకెళ్లే ఆలోచనలో ఉన్నాడట. కాగా ఈ సినిమా కథ యాక్షన్, ఎమోషన్ తో యువతను ఆకర్షించేలా ఉంటుందని అంటున్నారు. అంతే కాదు మహేష్ బాబు ఈ ప్రాజెక్ట్‌ను దగ్గరుండి చూస్తూ, కొన్ని నిర్మాణ అంశాల్లో కీలక సలహాలు ఇస్తున్నాడని సమాచారం.






### ఆర్ముగ్‌కుమార్ ఆదుకోవడంతోనే

# ఈ స్థాయిలో ఉన్నా

తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లే దు. విలక్షణ నటుడిగా అన్ని భాషల్లోనూ మంచి గుర్తింపు తెచ్చుకు న్నారు. హీరోగా మాత్రమే కాకుండా ఎలాంటి పాత్ర అయిన పడించ గల సతా ఉన్నవాడు. ముఖ్యంగా విలన్‌గా విజయ్ యాక్టింగ్‌కి విపరీ తమైనా ఫ్యాన్ ఫాలోయింద్ ఉంది. ప్రస్తుతం 'ఏస్'సినిమాతో ప్రేక్షకు ల ముందుకు రానున్న విజయ్ తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలి రోజుల్ని గుర్తుచేసుకున్నారు. విజయ్ మాట్లాడుతూ.. కెరీర్ ఆరంభంలో అవకాశాల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో 'వర్ణం' అనే సినిమాకు ఆడిషన్‌కు వెళ్లాను. తీరా అక్కడికి వెళ్లాక సీన్ చెప్పి డైలాగులు కూడా నన్నే రాసుకొని నటించమన్నారు. అప్పుడే తెలుసుకున్న నేను డైలాగులు కూడా రాయగలనని. ఆర్ముగ కుమార్ ఆ టీమ్‌కు నా పేరు సజెస్ట్ చేశారు. అలా ఆ సినిమాలో అవకాశం వచ్చింది. అలాగే క్లాసిక్ మూవీ '96'లో నేను నటించడానికి కూడా ఆయనే కారణం. 'ఒకసారి ఈ సినిమాకు విజయ్ సేతుపతి ఆడిషన్ తీసుకోండి. పాత్రకు సరిపోడు అనుకుంటే తిరస్కరించండి' అని ఆర్ముగ కుమార్ '96' టీమ్‌కు చెప్పారు. మనం అంటూ ఒక స్థాయి వచ్చాక ఎవరైనా సహాయం చేయడానికి ముందుంటారు. కానీ మనం ఎవరో తెలియనప్పుడు కూడా సహాయం చేయడం గొప్ప. ఆ సాయం చీకటితో నిండిన ఇంట్లో దీపం వెలిగించడం లాంటింది. అలా నా జీవితంలో ఆ దీపాన్ని వెలిగించిన మనిషి ఆర్ముగ కుమార్. అతడికి ఎప్పటికీ రుణపడి ఉంటాను' అని విజయ్ సేతుపతి అన్నారు.

# జూన్ 1నుంచి థియేటర్ల బంద్

తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేయాలని సినీ ఎగ్జిబిటర్లు నిర్ణయించారు. రెంటల్ బేసిస్‌లో సినిమాలు ప్రదర్శించలేకపోవడంతో ఎగ్జిబిటర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. తమకు పర్సంటేజీ రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని ఎగ్జిబిటర్లు స్పష్టం చేశారు. తెలుగు ఫిలిం ఛాంబర్‌లో ఆదివారం ఏర్పాటు- చేసిన సమావేశానికి నిర్మాతలు దిల్ రాజు, సురేశ్ బాబుతోపాటు- 60 మంది ఎగ్జిబిటర్లు హాజరయ్యారు. చాలా రోజులుగా పర్సంటేజీలపై ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య చర్చ నడుస్తోంది. రెంటల్ పద్ధతిలో సినిమాలు ప్రదర్శించడం సాధ్యం కాదని ఓ వైపు ఎగ్జిబిటర్లు అంటుండగా.. మరోవైపు వారికి పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారు. ఈ వ్యవహారం నిర్మాతలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ క్రమంలో ఎగ్జిబిటర్ల జాయింట్ మీటింగ్‌లో పర్సంటేజీ, ప్రభుత్వ విధానాలపై చర్చించారు. నిర్మాతలకు ఇందుకు సంబంధించిన ఓ లేఖ రాయాలని సమావేశంలో తీర్మానించారు.

### బాలనటుడు భరత్‌కు

# మాతృవియోగం

టాలీవుడ్ నటుడు, చైల్డ్ ఆర్టిస్ట్ మాస్టర్ భరత్ ఇంట విషాదం నెలకొంది. ఆయన తల్లి కమలహాసిని ఆదివారం రాత్రి చెన్నైలో గుండెపోటుతో మరణించారు. ఆమె అకాల మరణంతో భరత్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఈ విషయాన్ని కుటంబ సభ్యులు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఈ నేపథ్యంలో సినీ ప్రముఖులు, సన్నిహితులు ఆయనకు ఫోన్ చేసి ధైర్యం చెబుతున్నారు. బాల నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న భరత్.. ప్రస్తుతం పలు చిత్రాల్లో కీలక పాత్రల్లో నటిస్తూ మెప్పిస్తున్నారు.తెలుగులో అంజి సినిమాతో కెరీర్ ప్రారంభించాడు. రెడీ, ఢీ, దూకుడు, హ్యాపీ, దేనికైనా రెడీ ఇలా తెలుగు, తమిళ భాషల్లో వందకుపైగా సినిమాల్లో నడించాడు. రెడీ, బిందాస్ సినిమాల్లో నటనకుగాను నంది అవార్డులు అందుకున్నాడు.



### త్వరలోనే నంది అవార్డుల

# పునరుద్దరణ

**సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్**

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే రోజుల్లో సినిమా పరిశ్రమ అభివృదంది కోసం అవసరమైన ప్రణాళికలు సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో రచిస్తున్నామని ఏపీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. భైరైవం ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గేశ్ మాట్లాడుతూ.. ఏపీలో అద్భుతమైన అందాలు న్నాయి. ఇక్కడ సినిమా షూటింగ్‌లు జరుగుతు న్నాయి. ఇంకా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చెందాల్సి ఉంది. దానికి సంబంధించి స్టూడి యోల నిర్మాణం, డబ్బింగ్, రీరికార్డింగ్ థియేటర్లు నిర్మించడానికి అవసరమైన మద్దతు ఇవ్వడానికి పాలసీ తెచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. రాబోయే రోజుల్లో హైదరాబాద్ మాదిరిగానే విశాఖపట్నం అభివృద్ధి చేస్తాం అని అన్నారు. చాలాకాలంగా మూలన పడిపోయిన నంది అవార్డులను పునరుద్ధరిస్తాం. అతి తర్వలో ఆ అవార్డులకు సంబంధించి ప్రకటన ఇస్తాం. పరిశ్రమకు చెందిన ముఖ్యమైన నిర్మాతలు, దర్శకులు, నటులతో సమావేశం ఏర్పాటు



చేయనున్నట్లు వెల్లడించారు. నూటికి నూరు శాతం సినిమా పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తాం అని అన్నారు. ఇదిలావుంటే భైరవం' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు వస్తున్నా నని నటి అదితి శంకర్ అన్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకుడు. రాధామో హన్ నిర్మించారు. ఈ సినిమాలో ఇద్దరు కథానాయిక లుగా ఆనంది, దివ్య పిళ్ళై నటించారు. మే 30న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో అదితి శంకర్ మాట్లాడారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY V. SAMPATH PRINTED AT SHARADHA PRINTERS, SHASTRI ROAD, KARIMNAGAR- 505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,Cell:9391343644
PUBLISHED AT H.NO.2-10-2126, MANKAMMATHOTA, BHAGYANANAR, KKARIMNAGAR, -505002, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE. EDITOR : V SAMPATH. TELTEL/2023/89146, EMAIL :shenarthimedia@gmail.com